# కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

*ఎన్నికల ప్రచారంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి*



మంత్రి సబితాఇంద్రారెడ్డికి గొర్రె పిల్లను బహుకరిస్తున్న గొల్ల కుర్మలు

కందుకూరు, నవంబర్ 17 : డబ్బు సంచులు నెత్తిన పెట్టుకొని వచ్చినా.. కాంగ్రెస్ అభ్యర్థికి మహేశ్వరంలో ఓటమి తప్పదని మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ రియల్ ఎస్టేట్ వ్యాపారులని.. తాను రియల్ లీడర్‌నని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మాదాపూర్, కొలనుగూడ, గుమ్మడవెల్లి, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచె, అన్నోజిగూడ, కటికపల్లి, గూడూరు గ్రామాల్లో పర్యటించి ప్రసంగించారు. కష్టాల్లో కనబడని నేతలు నేడు ఇక్కడికి వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడలేని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని ఆమె కోరారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల చాలా కీలకమైనవని, ప్రజలు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. మొసలి కన్నీరు కార్చే కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో కర్ణాటక మాడల్‌గా రాష్ట్రంలో అమలు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, చిలకమర్రి నర్సింహ, జడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధిక రసాయన ఎరువులతో తగ్గిన భూసారం



సదస్సులో పాల్గొన్న అతిథులు

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 17: దేశంలో ఆయిల్ పంటల సాగు పెంచడానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని వ్యవసాయ వర్సిటీ పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ అనిత అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ఆవరణలోని ఆడిటోరియంలో ఆయిల్ ఫామ్‌తో పాటు వివిధ ఉద్యాన పంటల అభివృద్ధిపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా ఎర్రతాటి పురుగుల నివారణ అవసరమని, సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ పంటలను కాపాడుకునేందుకు అవకాశం ఉన్నదని చెప్పారు. మొక్కల ఆరోగ్య నిర్వహణపై మాట్లాడుతూ విత్తనం నాణ్యతతో పాటు , సాగు భూమిలో సేంద్రియ ఎరువులు, ఎలాంటి కాలుష్యం లేని వాతావరణంలో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే పంటల శాతం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే అందుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు అవసరమని చెప్పారు. వేప, కానుగ తదితర కషాయాలను పంటల చీడ పీడలకు వాడేవారని, అప్పటి తిండి గింజలు చాలా రుచిగా ఉండేవన్నారు. రాను రాను రైతులు అధిక దిగుబడి పేర, రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల నేలలో భూసారం తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సాగు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రమాదపు టంచున ఉన్నదన్నారు. ఐదేండ్లలో తెలంగాణ ప్రభుత్వం సాగుకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పలు సంక్షేమ పథకాలు , సాగు అనుబంధ రంగాలను ప్రోత్సహించడం వల్ల అధిక దిగుబడులు సాధ్యమయ్యాయన్నారు. ఇదే ధోరణి దేశ వ్యాప్తంగా అమలు అవసరమని డీన్ డాక్టర్ అనిత పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో శాస్త్రవేత్తలు , పలు పరిశోధనా పత్రాలు సమర్పించారు. వాతావరణ మార్పులు , చీడ పీడలు , తెగుళ్లపై ప్రభావం, రసాయన పురుగు మందులను ప్రత్యామ్నాయంగా జీవ ఎరువులు, జీవ శిలీంధ్రాలు, జీవ రక్షణ, జీవ పోషణ , జీవ వైవిధ్యం, జీవ భద్రత, సాంకేతిక అభివృద్ధి, అమలు అంశాలపై చర్చించారు. ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ సదసులో డా. కట్టి, సీనియర్ శాస్త్రవేత్తలు డా. టీవీకే సింగ్, డా. జెల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

---

"ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నాయని తెలిసి కూడా లక్షల్లో డబ్బులు తరలిస్తూ.. పట్టుబడుతున్నారు. ఎంత సీరియస్‌గా తరలించాలని ప్రయత్నించినా..ఆపరేషన్ ఎలా ఫెయిల్ అయింది.. మనం డబ్బులు తరలిస్తున్నట్టు వారికి సమాచారం ఎలా అందింది?' ఇది గ్రేటర్‌లోని ఓ అభ్యర్థి ఆవేదన. ఈ ఆపరేషన్ ఫెయిల్ వెనక కోవర్టు అనే ప్రత్యర్థి రహస్య మిత్రుడు తమ శిబిరంలో ఉన్నాడనే విషయం వారికి బోధపడింది."

"'కుల సంఘాలు, కాలనీ అసోసియేషన్లను కలిసి నాకు తోచినంత ఇచ్చి.. వారిని నా వైపునకు తిప్పకున్నా. కానీ ఇదే సూత్రం నా ప్రత్యర్థి అమలు చేశాడు. వారంతా గిప్పడు వారితో తిరుగుతున్నారు. మనోళ్లు మనోళ్లే గిట్ల చేస్తారనుకోలే. టికెట్ రాకపోయినా మీరంతా ఉన్నారన్న నమ్మకంతో రెబల్‌గా బరిలోకి దిగిన. శక్తికి మించి ఖర్చుపెడుతున్నా.. నా గెలుపు సూత్రాలన్నీ ప్రత్యర్థులకు తెలిసిపోతున్నాయి.' ఇది ఓ రెబల్ అభ్యర్థి ఆవేదన."

- ప్రత్యర్థికి సమాచారం చేరవేతలో రహస్య మిత్రులు
- మేల్కోపోతే ఓటమి ఖాయం
- ఆసక్తికరంగా పొలిటికల్ గేమ్
- అగ్గిరాజేస్తున్న కోవర్టుల సమాచారం
- అభ్యర్థులకు ముప్పు తిప్పలు
- కీలక సమాచారం ఇచ్చేవారికి భారీ డిమాండ్
- గ్రేటర్‌లో కాకరేపుతున్న కోవర్టుల ఆపరేషన్

# నీ చుట్టూ.. కోవర్టూ..!



సిటీబ్యూరో, నవంబర్ 17 ( నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో పొలిటికల్ హీట్ పెరిగింది. నువ్వా..నేనా అన్నట్టు అభ్యర్థులు ప్రచారంలో తలపడుతున్నారు. ఓ వైపు తొమ్మిదేండ్లలో జరిగిన అభివృద్ధే తమను గెలిపిస్తుందని బీఆర్ఎస్ గడపగడప ప్రచారంలో దూసుకుపోతుంటే..మరోవైపు ప్రతిపక్ష పార్టీలు ఎలాగైనా గెలవాలనే ఆకాంక్షతో ప్రజలను వదిలేసి కోవర్టులను నమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీల్లో చురుకుగా ఉన్నవారిపై కన్నేస్తున్నాయి. వారిని ప్రలోభాలకు గురిచేసి సమాచారం అందించేందుకు నాయకులు ఒప్పిస్తున్నారు. ఇప్పటికే వివిధ పార్టీల్లో కోవర్టులు చురుకుగా వ్యవహరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కొందరి అభ్యర్థుల వెంట అన్నా...అన్నా.. అంటూ పక్కన తిరుగుతున్నా.. అనుచరులే షాక్ ఇస్తున్నారు. ఇక్కడి సమాచారాన్ని అక్కడికి.. అక్కడి సమాచారాన్ని ఇక్కడికి మోస్తూ.. గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నారు. చుట్టూ ఉండే వాళ్లలో కోవర్టులెవరో.. తమ వారెవరో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. కోవర్టుల ప్రభావం గెలుపు అవకాశాలపై తప్పకుండా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కండువా కప్పేస్తున్నారు..

ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో ప్రత్యర్థి పార్టీలు కోవర్టుల కోసం లక్షలు వెచ్చిస్తున్నాయి. పోటీ తీవ్రంగా ఉండటంతో ప్రత్యర్థి కదలికలపై దృష్టి సారిస్తున్నాయి. ప్రచారం ఎక్కడెక్కడ సాగుతుంది? ఎవరెవర్నీ కలుస్తున్నారు? తదితర సమాచారం సేకరించే పనిలో నిమగ్నమవుతున్నాయి. అందులో భాగంగా గెలుపు అవకాశాలపై ప్రభావం చూపే నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులను తమ వైపునకు తిప్పుకుంటున్నారు. కోవర్టులపైనే భారీ ఆశలు పెట్టుకున్నారు. పోలింగ్‌కు రెండు, మూడు రోజుల ముందు ఎలాంటి ప్రణాళికలు వేయబోతున్నారో సమాచారం తెలుసుకుంటున్నారు. మరికొందరు అభ్యర్థులు ఏకంగా తమ అనుచరులనే ఇతర పార్టీల్లోకి పంపించి.. కండువా మార్చుకునేలా చేస్తున్నారు. అక్కడ జరుగుతున్న వ్యవహారాన్ని తెలుసుకుంటున్నారు.

## ప్రత్యర్థి వ్యూహాలను సులభంగా..

టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులను పార్టీపై కోపంతో వేరే పార్టీలోకి వెళ్లినా.. ఇన్నాళ్లు సొంత పార్టీలో ఉన్న నేతలతో ఉన్న సంబంధాలతో ప్రత్యర్థి వ్యూహాలను సులభంగా తెలుసుకోగలుగుతున్నారు. అంతేకాదు మరికొందరు ఆశావహులు పార్టీలోనే ఉంటూ అభ్యర్థి ఓడిపోయేలా తెర వెనక పావులు కదుపుతున్నారు. కుల సంఘాలు, కాలనీల ఓట్లు చీల్చడానికి ప్రత్యర్థులకు సలహాలిస్తూ సహకరిస్తున్నారు. కాగా, అభ్యర్థుల వెంట నిరంతరం ఉండే వారినే కోవర్టులుగా ఎంచుకుంటున్నారు. ఆ వ్యక్తులను రాత్రి సమయాల్లో రహస్యంగా సమావేశమై కావాల్సినంత ముట్టజెప్పి తమవైపు తిప్పుకుంటున్నారు. కోవర్టులు కూడా భారీ ప్యాకేజీ వస్తుండటంతో రహస్యంగా సేవలందించేందుకు సిద్ధమవుతున్నారు.

# 13 రోజులు.. చాలా కీలకం

## సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

సిటీబ్యూరో, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో రాబోయే 13 రోజులు చాలా కీలకమని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులకు సూచించారు. శుక్రవారం చేవెళ్ల, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల బందోబస్తుపై శంషాబాద్, రాజేంద్రనగర్ డీసీపీలు, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీపీ అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వాహనాల తనిఖీలను ముమ్మరం చేయాలని, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎన్నికల విధుల్లో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎలాంటి పక్షపాత ధోరణి అవలంబించినా.. చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మకమైన ప్రాంతాల్లో బ్లూకోట్స్ పెట్రోలింగ్, స్పెషల్ ఫోర్స్ తదితర భద్రతా బృందాలను మోహరించాలన్నారు.

# పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

## మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్ : ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, ఏమాత్రం అలసత్వం వహించినా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, డీఆర్‌వో హరిప్రియతో కలిసి జిల్లా ఎన్నికల అధికారులు, సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 6,449 మంది ఉన్నారని, వారు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు ప్రణాళిక ప్రకారం రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలన్నారు. వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని అవసరమైన యంత్రాంగం సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో ర్యాండమైజేషన్ సంఖ్య ఆధారంగా అవసరమైన నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు పంపిణీ చేయనున్నట్టు ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల అధికారి చాంబర్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులతో కలిసి మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి శాసనసభ నియోజకవర్గాల యాక్సిలరీ పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అదనపు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయింపులు జరిపారు.

# 'జానపద సినిమాలకే వన్నె తెచ్చిన కాంతారావు'



కత్తి కాంతారావు లఘు చిత్రాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, నవంబర్ 17: జానపద సినిమాలకే వన్నె తెచ్చిన గొప్ప నటుడు కాంతారావు అని, కత్తి యుద్ధంలో ఆయనను మించిన నటుడు మరొకరు లేరని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి సంస్థ, భారత్ కల్చరల్ అకాడమీ , మధుర సాంస్కృతిక సంస్థ హైదరాబాద్ నిర్వహణలో రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత టీఎల్ కాంతారావు శత జయంతి ముగింపు వేడుకలు రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో జరిగాయి. నాగబాల సురేశ్‌కుమార్ సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్థసారథి తొలుత కాంతారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ టీఎల్ కాంతరావు చలన చిత్ర రంగంలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నారని, ఆయన కనీసం పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులకు కూడా నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎల్ కాంతారావు సినిమా రంగంలో నష్టపోయి.. ఆస్తిని దానధర్మాలకు ఖర్చుచేసి.. చివరకు సొంత ఇల్లు లేకుండానే అద్దింట్లో ఉంటూ మృతి చెందారన్నారు. అలాంటి మహనీయులు సమాజంలో కొంత మంది మాత్రమే ఉంటారని, వారు నటించిన గొప్ప చిత్రాలు నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అంతకు ముందు స్టేషన్ ఘన్‌పూర్ సురభీ కళాకారులచే కత్తి కాంతారావు నాటక ప్రదర్శన, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన కళా ప్రపూర్ణ కత్తి కాంతారావు లఘు చిత్ర ప్రదర్శనను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి హాజరై కాంతారావు లఘుచిత్ర ప్రదర్శను తిలకించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు నాగబాల, సురేశ్‌కుమార్, సినీ నటి రోజారమణి, తుమ్మల ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.